క్లుప్తంగా

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న దయాకర్‌రెడ్డి

బోనకల్: మండలంలోని పలు గ్రామాలకు చెందిన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్‌రెడ్డి చెక్కులను గురువారం అందించారు. తూటికుంట్ల గ్రామానికి చెందిన యం చిట్టిబాబు, ముష్టికుంట్ల గ్రామానికి చెందిన మల్లయ్య రామాపురం గ్రామానికి చెందిన లక్ష్మీ, చిన్నబీరవల్లి గ్రామానికి చెందిన విమలమ్మకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఉమ్మినేని కృష్ణ,బాగం నాగేశ్వరరావు, సురేష్, రాంబాబు, మురళీకృష్ణ, వెంకట్రావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

బోనకల్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క బోనకల్ మండలం బీటీ రోడ్ల నిర్మాణానికి 19.70కోట్ల రూపాయిల నిధులను కేటాయిస్తూ జీఓ జారీ చేయడంతో.. మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేయడం పట్ల పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్, జిల్లా కార్యదర్శి బందం నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, సొసైటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరావు, మాజీ జెడ్పీటీసీ మోదుగు సుదీర్‌బాబు, పిల్లలమర్రి నాగేశ్వరరావు, చేబ్రోలు వెంకటేశ్వర్లు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

సాయినాధుడికి ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని సాయిబాబా ఆలయాల్లో గురువారం అర్చకులు బాబాకి సాంప్రదాయబద్ధంగా, శాస్త్రోక్తంగా పూజలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు బాబాని దర్శించుకుని పూజలు జరుపుకున్నారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. మండలకేంద్రంలోని ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల వెంకటస్వామి, తదితరులున్నారు.

కేజీబీవీలో కుక్ పోస్టుకు దరఖాస్తులు స్వీకరణ

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో వంట చేసేందుకు గానూ మహిళా కుక్ (వంట మనిషి) నియామకం కోసం అర్హులు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఎంఈఓ మురళీమోహన్‌రావ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికంగా ఉంటూ.. 10వ తరగతి పాసై, వంట చేయడంలో అనుభవం కలిగి ఉండాలన్నారు.

గొల్లపూడి వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాతలు

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి వృద్ధాశ్రమంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం చింతోజు నాగేశ్వరరావు, సీత దంపతుల మనవరాలు ఎతిక్ష జన్మదిన వేడుకలను పురస్కరించుకొని వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ బాధ్యులు పెనుగొండ ఉపేందర్‌రావు, ఏడునూతల బుచ్చి రామారావు, కట్ల సంతోష్, దీప, వృద్ధాశ్రమ నిర్వాహకులు పాల్ నరిసింహరావు, విజయకుమారి పాల్గొన్నారు.

నర్సయ్యకు ఘన నివాళి

కల్లూరురూరల్: మండలంలోని పేరువంచ గ్రామంలో బుధవారం రాత్రి కారు వేగంగా దూసుకొచ్చి ఏడుగురు వ్యక్తులను గాయపరిచిన సంఘటన పాఠకులకు విధితమే. కాగా మంచాల చిన్న నర్సయ్య ఖమ్మంలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఐదుగురు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడిని పేరువంచకు తీసుకురాగా.. రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్, చిన్న నర్సయ్య భౌతిక కాయానికి నివాళులర్పించారు. ప్రభాకర్, మోహన్‌నాయక్, వీరమోహన్‌రెడ్డి, భరత్ పాల్గొన్నారు.

నిరీక్షణ!

పూర్తి స్థాయిలో అందని రుణమాఫీ

- సాంకేతిక కారణాలతో ఆగిన వైనం..
- కొనసాగుతున్న కుటుంబ నిర్ధారణ ప్రక్రియ
- అర్హులకు తప్పని ఎదురుచూపులు



మత్కేపల్లి గ్రామంలో సర్వే చేస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

చింతకాని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన రూ.2 లక్షల రుణమాఫీ మండలంలోని కొంతమంది రైతులకు ప్రయోజనం కలగగా.. మరికొంతమంది రైతులకు ఆందోళనను కలిగించింది. మండల వ్యాప్తంగా సుమారు 8,500 మంది రైతులు రుణమాఫీకి అర్హత ఉన్నప్పటికీ ప్రభుత్వం మూడు విడతలుగా చేసిన రుణమాఫీలో 6,500 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసింది. మిగిలిన రెండువేల మంది రైతులకు.. రేషన్‌కార్డు లేకపోవటం, ఆధార్, బ్యాంక్ ఖాతాల్లో పేర్లు తప్పుగా నమోదు కావటం, పట్టాదారు పాసుపుస్తకం లేకుండా రుణాన్ని పొందటం, రూ.2 లక్షలకు పైబడి రుణాలను పొందటం, ఇతరత్రా సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాలేదు. ఇదిలా ఉండగా అర్హత ఉండి రూ.2 లక్షలకు లోబడి రుణాలు తీసుకున్న రైతులకు కూడా కొంతమందికీ మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అర్హత ఉన్న రైతులందరికీ ఈ పథకాన్ని వర్తింపచేయాలని అధికారులకు విన్నవించారు.

రేషన్‌కార్డు లేని రైతులు..

రేషన్‌కార్డు లేకపోవటంతో రూ.2 లక్షల రుణమాఫీ పొందని రైతులు మండల వ్యాప్తంగా 1,584 మంది ఉన్నట్లు వ్యవసాయాధికారులు గుర్తించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక యాప్ ద్వారా రేషన్‌కార్డు లేని రైతుల కుటుంబ నిర్ధారణ ప్రక్రియను వ్యవసాయాధికారులు ఆగస్ట్ 28వ తేదీన చేపట్టారు. ప్రతి గ్రామంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి ఇప్పటివరకు 1,304 మంది రైతులకు సంబంధించిన కుటుంబ సభ్యుల వివరాలను యాప్‌లో నమోదు చేశారు. కుటుంబ నిర్ధారణ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత రేషన్‌కార్డు లేక రుణమాఫీ పొందని రైతులందరికీ రుణమాఫీ అమలవుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ముదిగొండ: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 10నెలలు కావస్తున్నా రూ.రెండులక్షలు రుణమాఫీ అంక్షలతోనే సరిపెడుతున్నారు. వేలకు వేలకు అప్పులు చేసి పంటలు పండిస్తున్న రైతన్నలకు రుణమాఫీపై గంపెడు ఆశలు పెట్టుకున్నారు. రూ.2లక్షలు పైన రుణం పొందినవారు, బ్యాంకుల్లో రెన్యూవల్ చేసి, మిగిలిన బకాయిని జమచేసినా ఫలితం దొరకలేదు. తీరా ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టపోయి, ఇటు పంట కోసం తెచ్చిన అప్పులు అటు బ్యాంక్‌ల్లో ఉన్న రుణాలు తీర్చుకోలేక దిక్కుతోచని స్థితిలో తలలు పట్టుకుంటున్నారు.



అమ్మపేటలో సాగుచేస్తున్న పత్తిపంట

రుణమాఫీ పథకంతో రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మధిర నియోజకవర్గంలో రుణమాఫీ అయిన రైతులు

మొదటి విడత	15,760
రెండో విడత	8,091
మూడో విడత	6153
పెండింగ్	15,675

రేషన్‌కార్డు లేదని..



నా పేరుతో రూ.1.50 లక్షల పంటరుణం ఉంది. రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. అధికారులను సంప్రదిస్తే రేషన్ కార్డు లేకపోవటంతో రుణమాఫీ కాలేదని చెప్పారు. రేషన్‌కార్డు లేకపోవటంతో రుణమాఫీ కోసం వ్యవసాయాధికారులు చేపట్టిన కుటుంబ నిర్ధారణ ప్రక్రియలో మా కుటుంబసభ్యుల వివరాలను నమోదు చేశారు.

– వత్సవాయి లక్ష్మీ, పందిళ్లపల్లి

రుణమాఫీ అమలు చేయాలి...



నాకు ఉన్న ఐదెకరాల భూమిలో మిర్చి, వరి, మొక్కజొన్న వేశాను. రూ. 2.40వేలు అప్పు ఉంది. రూ.2లక్షల రుణమాఫీ కోసం పైన ఉన్న రూ.40వేలు చెల్లించాను. ఇంత వరకు రుణమాఫీ కాలేదు. మాఫీ కోసం ఎదురు చూస్తున్న. ఎప్పుడు జమచేస్తారని ఆశగా ఉంది.

– ఎర్ర రాము, రైతు, బాణాపురం

మాఫీ వర్తించేలా చూస్తాం..



రేషన్‌కార్డు లేక రుణమాఫీ వర్తించని రైతుల కుటుంబ నిర్ధారణ ప్రక్రియను నిర్వహిస్తున్నాం. మండలంలో కుటుంబ నిర్ధారణ 80 శాతం పూర్తి అయింది. స్థానికంగా లేక ఉద్యోగ రీత్యా ఇతర ప్రాంతాల్లో ఉన్న రైతుల కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాల్సి ఉంది. అర్హత ఉన్న రైతులందరికి రుణమాఫీ వర్తించేలా చూస్తాం.

– పల్లెల నాగయ్య, ఏఓ, చింతకాని

హక్కుల సాధనకు పోరాడాలి

విలీన సభను జయప్రదం చేయండి



విలీన సభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

చింతకాని: కార్మికుల హక్కుల కోసం పోరాడాల్సిన బాధ్యత ప్రతి కార్మికుడిపై ఉందని ఐఎఫ్‌టీయూ ఖమ్మం జిల్లా నాయకుడు ఆడెపు కోటేశ్వరరావు, ప్రభాకర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఐఎఫ్‌టీయూ విలీన సభ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్నటువంటి అనేక మంది కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు శ్రీను, దస్తగిరి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

- కొణిజర్ల: ఈ నెల 20న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన మహాసభను జయప్రదం చేయాలని హామాలీ సంఘం ఖమ్మం జిల్లా నాయకుడు ఆలకుంట శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ఎల్లన్న నగర్‌లో సభకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. సభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలకుంట బలరామ్, ఎత్తేరు వెంకన్న, అజయ్ గోపి, రమేష్, సోములు, కృష్ణ, బాలు, రమేష్ పాల్గొన్నారు.

సత్తుపల్లిలో..



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

- సత్తుపల్లిటౌన్: సత్తుపల్లితో టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనసభ పోస్టర్లను ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు పుల్లయ్య, ఎ.శరత్ ఆవిష్కరించారు. ఈ 20న హైద్రాబాద్‌లో జరిగే విలీనసభకు భారీగా తరలిరావాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, సురేష్, రామకృష్ణ, కనకయ్య, రత్నాకర్, జయరాజు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వాముల ఇరుముడి



అన్నారుగూడెం ఇరుముడి మహోత్సవంలో పాల్గొన్న మట్టా దయానంద్, అయ్యప్ప మాలధారులు

తల్లాడ: మండలంలోని బాలపేట, అన్నారుగూడెం గ్రామాల్లో గురువారం అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. బాలపేట, అన్నారుగూడెంలో అయ్యప్ప స్వాములు 41 రోజులు కఠిన దీక్ష అనంతరం ఇరుముడి దరించి శబరిమలైకు ప్రత్యేక వాహనాల్లో బయలు దేరారు. ఈ సందర్భంగా గురుస్వాములు గోవింద్ శ్రీనువాసరావు, కోసూరి నరసింహారావు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాలపేట, అన్నారుగూడెంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. అన్నారుగూడెం అన్నదాన కార్యక్రమాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గోవింద్ శ్రీనివాసరావు, దగ్గుల రఘుపతిరెడ్డి తుమ్మలపల్లి రమేష్, వడ్డేరామారావు, జోసఫ్, పొన్నం కృష్ణయ్య, సూదా నరసింహారావు, సుంకర నాగేశ్వరరావు, అయప్ప మాలధారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మధిర: రాష్ట్రంలో మినీ నుంచి మెయిన్ అయిన 4వేల మంది అంగన్‌వాడీ టీచర్లకు ఐదునెలల పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం నరసింహారావు అన్నారు. ఈ సందర్భంగా గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు జూనియర్ అసిస్టెంట్ వెంకటరమనకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి, ఏప్రిల్, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల వేతనాలు పాత పద్ధతిలో సగం వేతనాలే చెల్లించారని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్దెత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ వడ్రణపు మధు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు వరలక్ష్మి, పద్మవతి, స్నేహలత, కృష్ణవేణి, అక్కమ్మ, చిట్టెమ్మ, అంజమ్మ, ప్రశాంతి, ఇందిరా, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



జూనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కొమురం భీం వర్ధంతి వేడుకలు



గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో భీం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ఆదివాసీ ఉద్యమనాయకుడు కొమురం భీం వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ రాజేశ్వరీ కొమురం భీం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆదివాసీల ఆత్మ గౌరవానికి ప్రతీక కొమురం భీం అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ స్వర్ణకుమారి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఎంపీ ఈటలకు వినతి



ఎంపీ రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కారేపల్లి: కారేపల్లి రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌కు రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ సభ్యుడు తురక నారాయణ ఖమ్మంలో గురువారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఖమ్మం జిల్లాలో ఏకైక జంక్షన్‌గా పేరుగాంచిన, మండల కేంద్రమైన కారేపల్లి రైల్వే స్టేషన్‌లో ఇటీవల ప్రారంభమైన బెల్గావి రైలుకు రైల్వే అధికారులు హాల్టింగ్ కల్పించి, ఈ ప్రాంత ప్రజలకు ప్రయాణ సౌకర్యాన్ని సులభతరం చేయాలని, కరోనా సమయంలో రద్దు చేసిన కాజీపేట – మణుగూరు, డోర్నకల్ – భద్రాచలం రైళ్లను పునరుద్దరించాలని, రైల్వే స్టేషన్‌లో రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్‌ను పునరుద్దరించాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు గొడుగు శ్రీనివాసరావు, జంగా వెంకటేశ్వర్లు, తాళ్లూరి సారయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఎం మండల మహాసభ

ముదిగొండ: మండల పరిధిలోని అమ్మపేటలో శుక్రవారం సీపీఎం మండల మహాసభ నిర్వహిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల మహాసభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారని ఆయన తెలిపారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి



సత్తుపల్లిరూరల్: వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కమాండెంట్ చటర్జీ



కల్లూరురూరల్: ఆర్డీఓ కార్యాలయంలో..

మధిర/సత్తుపల్లిరూరల్/కల్లూరురూరల్: వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గురువారం ఆయా మండలాల్లో ఘనంగా నిర్వహించి.. ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధిరలోని ఆత్కూరులో యువసేన ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. అదే విధంగా సత్తుపల్లిరూరల్ మండలంలోని గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో నిర్వహించిన జయంతి వేడుకల్లో బెటాలియన్ కమాండెంట్ పీజేపీసీ చటర్జీ హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కల్లూరులోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రాజేంద్రగౌడ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రామాయణం రచించి ప్రపంచానికి తెలియజేసిన ఆదికవి వాల్మీకి మహర్షి అంటూ గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమాలల్లో అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌డీ రంగారెడ్డి, ఆఫీసర్లు, కానిస్టేబుల్స్, బెటాలియన్ సిబ్బంది, డీఏఓ రమేష్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ బంతిరాం, కార్యాలయ సిబ్బంది, వాల్మీకి సంఘ నాయకులు మీనుగు. చైతన్య ,అంకె అప్పారావు, మీనుగు శంకర్, పిక్కిలి పుల్లయ్య, మీనుగు స్వామి, మల్ల రంగ, వెంకటయ్య, నాగయ్య, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

‘ఇందిరా మహిళా శక్తి’ లక్ష్యం చేరుకోవాలి

కల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకం లక్ష్యాన్ని చేరుకోవాలని ఏపీడీ ఎండీ నూరుద్దీన్ అన్నారు. గురువారం కల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో రూ.2 లక్షలు బ్యాంక్ రుణంతో ఏర్పాటు చేసిన జాహ్నవి రెడీమేడ్ షాపు, రూ.4 లక్షలతో హోటల్, కర్రీ పాయింట్ ఏర్పాటు చేసిన లక్ష్మీప్రసన్న హోటల్, రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన పి.నాగమణి కర్రీపాయింట్ యూనిట్లను ఐకేపీ అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఎం వెంకట్రామారావు, ఈఓ నాగేశ్వరరావు, సీసీలు సీహెచ్ శ్యామల, రాజ్యలక్ష్మి, వెంకట్రావమ్మ, ఫాతిమ, ఎస్తేరు, రాధారుక్మిణి, అకౌంటెంట్ అపర్ణలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కల్లూరులో హోటల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

మధిర: తొండలగోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని తొర్లపాడు ప్రాథమిక పాఠశాలలో గత 9 సంవత్సరాలుగా ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీల్లో భాగంగా ఖమ్మం వెళ్తున్న రాయబారపు రమేష్, చందనలను గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారి సేవలను కొనియాడారు. అదే విధంగా పాఠశాలకు కొత్తగా నియామకం పొందిన ఉపాధ్యాయుడు యస్.గోపి చంద్‌ను అభినందించారు. కార్యక్రమంలో రామిరెడ్డి, మాజీ విద్యా కమిటీ చైర్మన్ సుధాకర్, మాజీ సర్పంచ్ పింగళి శిరీష, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు..

ముదిగొండ: మండలంలోని న్యూలక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నూతన ఉపాధ్యాయులు అల్లాడి పూర్ణచందర్‌రావు, రాంప్రసాద్‌లను హెచ్‌ఎం మైత్రి, ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు.

విద్యుత్ అధికారులకు..



మామునూరులో విద్యుత్ అధికారులను సత్కరిస్తున్న సిబ్బంది

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు గ్రామంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ ఆర్.శ్రీనివాసరావు ఖమ్మం టౌన్ స్టోర్స్‌కు బదిలీ కాగా.. లైన్‌ఇన్‌స్పెక్టర్ మాదారెడ్డి మధిరటౌన్‌కు బదిలీ అయ్యారు. గురువారం స్థానిక సిబ్బంది వీరిని శాలువాలతో ఘనంగా సన్మానించి, వారి సేవలను ప్రశంసించారు.

నియామకం..

కారేపల్లి: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా కారేపల్లికి చెందిన భూక్యా చందూనాయక్‌ను నియమిస్తూ.. గురువారం నియామక పత్రం అందించారు. కారేపల్లి మండలంలో మలిదశ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న భూక్యా చందూనాయక్‌ను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడుగా ఎన్నుకోవటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలక ప్రభుత్వాలు కారేపల్లిలోని ఉద్యమకారులపై నమోదైన రైల్వేకేసులను కొట్టేయాలని తెలిపారు.

గుడి పేరుతో రాజకీయాలు తగదు..



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కారేపల్లి: ఆలయం పేరుతో రాజకీయాలు చేయడమే కాక తాను శ్రీపెద్దమ్మతల్లి ఆభరణాలు, సౌండ్ సిస్టమ్ ఎత్తుకెళ్లానని అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆలయ నిర్వహన కమిటీ మాజీ చైర్మన్ మండెపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. కారేపల్లిలో గురువారం ఆయన మాట్లాడుతూ 2017లో శ్రీపెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణం గ్రామస్తులు, అప్పటి సర్పంచ్ మండెపూడి రాణి–శ్రీనివాసరావు ఆధ్వర్యాన జరగగా, గ్రామపెద్దలతో కూడిన 11మంది కమిటీ నేతృత్వాన ప్రతిష్ఠాపన చేపట్టామన్నారు. కానీ ఎలాంటి సంబంధం లేని వారు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ అంశంపై తాను పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. ఈ సమావేశంలో ఓరుగంటి రాజు, చిరునోముల రామారావు, ఎలగందుల మధు, పిల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



మాట్లాడుతున్న మాస్‌లైన్ నాయకుడు అశోక్

కారేపల్లి: అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు ఆవుల అశోక్ అన్నారు. గురువారం కారేపల్లిలో నిర్వహించిన సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇళ్ల విషయంలో గత పాలకుల మాదిరిగా చేస్తే సహించేది లేదని, అఖిలపక్ష పార్టీలను కలుపుకుపోవాలన్నారు. లేకుంటే అర్హులకు ఇళ్లు దూరమవుతాయన్నారు. ఈ సమావేశంలో మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి టి ఝాన్సీ, మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, నాయకులు గుగులోతు తేజ్యానాయక్, ఎన్‌వీ రాకేష్, ధరావత్ సక్రు, పులకాని సత్తిరెడ్డి, వేములపల్లి వీరన్న, కోయల శ్రీనువాస్, బిక్కసాని భాస్కర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు ఏమయ్యాయి?

ఎర్రుపాలెం: ఆరు గ్యారంటీ హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా, పెన్షన్లు పెంపు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి – తులం బంగారం హామీలన్నీ ఏమైపోయాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. గురువారం మండలకేంద్రంలోని శుభమస్తు కల్యాణమండపంలో నిర్వహించిన సీపీఎం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాబోయే స్థానిక ఎన్నికలకు కార్యకర్తలు, నాయకులు సిద్దంగా ఉండాలని కోరారు. తొలుత పార్టీ సీనియర్ నాయకుడు గొల్లపూడి కోటేశ్వరరావు మహాసభ ప్రారంభ సూచికగా పార్టీ జెండా ఆవిష్కరించారు. స్వర్గీయ సీతారాం ఏచూరి సీతారాం, పలువురు నాయకులకు నివాళి అర్పించారు. మండల కార్యదర్శి దివ్వెల వీరయ్య కార్యదర్శి పార్టీ మండలస్థాయి నివేదికను సమర్పించారు. అనంతరం సీపీఎం మండల నూతన కమిటీని ఎన్నిక చేశారు. పార్టీ మండల కార్యదర్శిగా మద్దాల ప్రభాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండి రమేష్, చింతలచెరువు కోటేశ్వరరావు, నున్నా నాగేశ్వరరావు, దివ్వెల వీరయ్య, షేక్ బషీరుద్దీన్, నల్లమోతు హనుమంతరావు, ఇమ్మేలమ్మ, దూదిగం బసవయ్య, కోటి సుబ్బారెడ్డి, నాగులవంచ వెంకట్రామయ్య, షేక్ నాగుల్‌మీరా, సగ్గుర్తి సంజీవరావు తదితరులున్నారు.



మాట్లాడుతున్న పొన్నం వెంకటేశ్వరరావు